సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

సందడిగా స్టోరీ టెల్లింగ్



పిల్లలకు కథలు చెబుతున్న కథకులు వరలక్ష్మి

సీతంపేట: భారతీయ విద్యా భవన్స్ స్కూల్, విశాఖపట్నం పౌర గ్రంథాలయం సంయుక్తంగా ఆదివారం ఉదయం లైబ్రరీలోని మియావాకీ సెంటర్‌లో నిర్వహించిన స్టోరీ టైం విద్యార్థులను అలరించింది. ప్రముఖ కథకులు కె. వరలక్ష్మి రాజస్థానీ జానపద కథలతో చిన్నారులను మంత్రముగ్ధులను చేశారు. రాజస్థాన్ సంప్రదాయాలతో, సృజనాత్మకతతో, రాజస్థానీ తోలు బొమ్మలు, కథలు చెప్పి విద్యార్థులను ఆకట్టుకున్నారు. కథలకు సంగీత వాయిద్యాలను లయబద్ధంగా జోడించి పిల్లలు సైతం జత కలిపేలా కథలో లీనం చేశారు. నగరంలో వివిధ పాఠశాలల నుంచి సుమారు 60 మంది పిల్లలు పాల్గొని ఆసక్తిగా కథలు విన్నారు. అనంతరం పేపర్‌తో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఓరిగామి, వర్క్ షీట్ నింపడం, పిక్చర్ బుక్ వంటి యాక్టివిటీ చేయించారు.

యూత్ ఆధ్వర్యంలో అన్న సమారాధన



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సీతంపేట: యూత్ అండ్ యూత్ పవర్ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయం వద్ద నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వి.బాబ్జి, జి. సురేష్, పి.రాంబాబు, పి.మహేష్, టి.సంతోష్‌కుమార్, హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

24న మాధవ పెద్ది సురేష్‌కు సత్కారం



మద్దిలపాలెం: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 4వ వర్ధంతిని ఈనెల 24వ తేదీన మద్దిలపాలెం కళా భారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నామని ప్రతాప్ తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6.30 గంటల నుంచి బాలు గీతాలాపనతో సినీ సంగీత విభావరి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌కు డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత పురస్కారంతో సత్కరించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకర్ బ్రత బాగ్చీ, విశిష్ట అతిథిగా మాజీ స్పీకర్ యనమల రామకృష్ణుడు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు హాజరుకానున్నా రన్నారు. మిలీనియం శేఖర్ బృందంచే సినీ సంగతి విభావారి నిర్వహించనున్నా మన్నారు.

తైక్వాండో క్రీడాకారుడికి సత్కారం



తైక్వాండో క్రీడాకారుడు ప్రకాశరావు, కోచ్ రుక్మాకరరావులను సత్కరిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: తైక్వాండో క్రీడలో విశేష ప్రతిభ కనబరిచిన మలిపర్తి ప్రకాశరావుతో పాటు కోచ్ పాండ్రంకి రుక్మాకరరావుకు ఘన సత్కారం లభించింది. ప్రకాశరావు ఈ నెల 26 నుంచి 30 వరకు మలేషియాలో జరగనున్న తైక్వాండో పోటీలకు వెళ్తున్న సందర్భంగా ఉచిత శిక్షణ ఇచ్చిన రుక్మారరావును ఆక్సిజన్ టవర్స్ ప్రెసిడెంట్ తిరుపతిరాజు, ఎలియన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ డి. పోలారావు ఘనంగా సత్కరించారు. పోటీల్లో గెలిచి దేశానికి కీర్తి తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సభ్యులు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

అడుగుకో గొయ్యి... చూసి అడుగెయ్యి



హేమ ఎడోబ్స్ వద్ద రహదారి మధ్యలో గొయ్యి



కోకోకోలా కంపెనీ సమీపంలో గొయ్యి



పెట్రోల్‌బంక్ వద్ద రహదారి దుస్థితి



పాత్రా వద్ద భారీ గొయ్యి

- సేవా రహదారిలో ప్రమాద ఘంటికలు
- పట్టించుకోని అధికారులు

మురళీనగర్: జాతీయ రహదారికి అనుబంధంగా ఏర్పాటు చేసిన సేవా రహదారుల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. బిర్లా కూడలి నుంచి ఊర్వశి కూడలి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సేవా రహదారిలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా పట్టించుకునే నాథుడు కనిపించడం లేదు.

నిత్యం రద్దీగా..

సేవా రహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఎదురెదురుగా ద్విచక్రవాహనాలతో పాటు కార్లు, ఆటోలు నిత్యం వచ్చి పోతుంటాయి. ఈ ప్రాంతంలో అత్యధిక కాలనీలు ఉండడంతో కుడి వైపు కూడా ఇదే రహదారిపై వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. బర్మాకాలనీ, బర్మా క్యాంపు, అల్లూరి సీతారమరాజు నగర్, ప్రగతి నగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, సత్యానగర్–1,2, సూర్యానగర్, మురళీనగర్, మాధవదారకు వెళ్లే ప్రయాణికులు, ప్రజలు ఈ రహదారిలో ప్రయాణిస్తుంటారు. పాఠశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులు ఇటువైపే రాకపోకలు సాగిస్తుంటారు. ఒక్కోసారి ట్రాఫిక్ కూడా నిలిచిపోతుంటుంది. ఇటువైపు సర్వీసు కంపెనీలు, షోరూములు, షాపింగు కాంప్లెక్సులు ఉన్నాయి. కొనుగోలుదారులు అత్యధికంగా వస్తుంటారు.

వర్షం వస్తే నరకమే..

ఈ రహదారిలో అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది. హేమా ఎబోడ్స్, పాస్‌పోర్టు కార్యాలయం నుంచి పాత్రా కంపెనీ, పెట్రోలు బంకు, కోకోకోలా, ఎంఆర్‌ఎఫ్ టైర్స్ సమీపంలో రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. రహదారి అంచులు శిథిలమై ప్రమాదకరంగా తయారయ్యాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం పడితే గోతుల్లో నీరు ఉండిపోతోంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పాస్‌పోర్టు కార్యాలయం సమీపంలో చిన్న పాటి వర్షాలకు నీరు చేరి రోజంతా నిల్వ ఉండిపోతుంది. పాలిటెక్నిక్ ప్రాంతంలో ఇసుక మేటలు వేయడంతో వాహనాలు స్కిడ్ అవుతున్నాయి.

కనీసం ప్యాచ్ వర్కు చేయండి



సేవా రహదారిలో గోతులు చిన్నవిగా కనిపిస్తున్నా చాలా ప్రమాదకరంగా మారాయి. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాల సమయంలో మురికి కూపంలా తయారవుతోంది. ఒక్కోసారి భారీ వాహనాలు ఇటు వైపు వస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. గోతులతోపాటు రహదారి అంచుల వద్ద తక్షణం ప్యాచ్ వర్క్ చేస్తే ప్రమాదాలు నివారించవచ్చు.

– ఆర్.నాగేశ్వరరావు, పట్టాభిరెడ్డితోట

వాహనాల పార్కింగ్ నిరోధించాలి



సేవా రహదారిని ఆనుకుని ఉన్న షాపింగు కాంప్లెక్సులు, పాస్‌పోర్టు కార్యాలయం వద్ద వాహనాలు పార్కు చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో వాహనాల రాకపోకలకు కష్టమవుతోంది. భారీ వాహనాల రాకపోకలు నిరోధించాలి. పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలి. గోతులను తక్షణం పూడ్చాలి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చింతాడ అచ్యుత రామారావు, మురళీనగర్

హద్దు మీరితే చర్యలు తప్పవు

రౌడీషీటర్లకు పోలీసుల హెచ్చరిక



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ డీవీ రమణ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఫోర్తుటౌన్ ఎస్‌ఐ వెంకటరావు



పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక నిమజ్జనంలో ఎటువంటి అల్లర్లు చేసిన కఠినమైన చర్యలు తీసుకుంటానని ద్వారకా సీఐ డి.వెంకటరమణ హెచ్చరించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే వేలి ముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో 18 గణేష్ నిమజ్జనాలు జరుగుతున్నాయని తెలిపారు. ఒకొక్క గణపతి నిమజ్జనం వద్ద ఒక కానిస్టేబుల్ పర్యవేక్షిస్తారన్నారు. మద్యం సేవించి అల్లరు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసభ్యకర నృత్యలు చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. నిమజ్జనం నిర్వహించే రోజు రౌడీషీటర్లను అదుపులో తీసుకుంటామన్నారు. నిమజ్జనాలు పూర్తయిన తరువాత ఇంటికి పంపిస్తామన్నారు. రౌడీషీటర్ల తీరుపై పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చాలా సీరియస్‌గా ఉన్నారని , హద్దు మీరితే జిల్లా బహిష్కరణ తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీను, పలువురు సిబ్బంది పాల్గొ న్నారు.

ఫోర్తుటౌన్ స్టేషన్‌లో...

ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్‌లో కూడా రౌడీ షీటర్లను ఎస్‌ఐ వెంకటరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. అల్లర్లను దూరంగా ఉండాలని సూచించారు. అలాగే క్రైం స్టేషన్‌లో పాత నేరస్తులకు ఎస్‌ఐ భాస్కరరావు కౌన్సెలింగ్ చేశారు. దొంగతనాలకు దూరంగా ఉండాలన్నారు.

'అర్ధనారీశ్వర గణపతి' అలంకారంలో దుర్గాగణపతి



సీతంపేటలో 'అర్ధనారీశ్వర గణపతి' అలంకారంలో దుర్గాగణపతి

సీతంపేట: వినాయక నవరాత్రి మహోత్సవాలలో భాగంగా సీతంపేటలో కొలువైన దుర్గా గణపతి చివరి రోజు ఆదివారం సాయంత్రం 'అర్ధనారీశ్వర గణపతి' అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు. ఉదయం ఆలయంలో గణపతి హోమం, స్వామి వారికి పంచామృత అభిషేకం, చందన, విభూది, ఫల రసాలతో విశేష అభిషేకం, సహస్ర నామార్చన, ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, ఆర్కెస్ట్రా భక్తులను అలరించింది.

దుర్గా గణపతి ఉత్సవ మూర్తుల ఊరేగింపు నేడు

నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా దుర్గా గణపతి ఉత్సవ మూర్తుల భారీ ఊరేగింపు కార్యక్రమం సోమవారం సాయంత్రం జరుగనుందని ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. మేళతాళాలతో సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవ మూర్తుల ఊరేగింపు కన్నుల పండువగా జరుగుతుందని భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

వాడవాడలా గణనాథుడికి పూజలు



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును సత్కరిస్తున్న యువసేవ ఫౌండేషన్ సభ్యులు



ఆహారపదార్థాలు వడ్డిస్తున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్రావు



సీఐ బాలసూర్యరావుదంపతులను సత్కరించిన ఆలయ చైర్మన్ టీఎస్ఎన్‌మూర్తి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు పరిధి తాటిచెట్లపాలెంలో యువసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ డి అడిక్షన్ గణేషుని ఆదివారం ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జనసేన నాయకులు, జబర్దస్త్ ఫేం అప్పారావులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో 15 ఏళ్లుగా సమాజానికి సందేశమిచ్చేలా వినాయక మండపాలను ఏర్పాటు చేస్తున్న యువసేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పీలా హరిప్రసాద్‌ను అతిథులు అభినందించారు. విశాఖను డ్రగ్స్ ఫ్రీ సిటీగా చేసేందుకు తమ పందిరి ద్వారా ప్రజలకు అవగాహ న కల్పిస్తున్నట్లు హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో 45వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు త్రినాథరావు, శివదత్ పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని కాలనీల్లో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఆదివారం పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల ఉత్సవ కమిటీల ఆహ్వానం మేరకు 50వ వార్డు తెలుగుదేశం అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌తో కలిసి ఆయన వినాయక మండపాలను సందర్శించి పూజలు చేశారు.

49వ వార్డులో..

సీతమ్మధార: జీవీఎంసీ పరిధి 49వ వార్డు సత్య నగర్ గ్రామ రామాంజనేయ యువజన విభాగం సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్రావు పాల్గొని భక్తులకు ఆహారపదార్థాలు వడ్డించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎ.రవికుమార్, గ్రామ అధ్యక్షుడు సి.వెంకటరావు, వి.వెంకటరావు, బి.సూరిబాబు, ఈ.సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

14వ వార్డులో..

జీవీఎంసీ పరిధి 14వ వార్డు గణేష్ నగర్‌లోని శ్రీశ్రీశ్రీ త్రిముఖ విఘేశ్వర ఆలయంలో ఏకాదశి మహోత్సవాలు సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద గురునాథ శర్మ ఉదయం 9 గంటలకు పూజలు నిర్వహించారు. సీఐ బాలసూర్యారావు దంపతులు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.ఎ స్.ప్రకాశరావు, బి.కె.నాయుడు, శంకరనాయుడు, సత్యనారాయణ, వెంకటలక్ష్మి, శైలకుమారి , శ్రీదేవి, కోటేశ్వరమ్మ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

24వ వార్డులో..

సీతమ్మధార : జీవీఎంసీ 24 వార్డు నక్కవానిపాలెం మెగా యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె ,బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక పాల్గొని పూజలు నిర్వహించారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్



నిందితులు

అక్కిరెడ్డిపాలెం: సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న కంచరపాలెం ప్రాంతానికి చెందిన ముగ్గురిని గాజువాక క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. క్రైం సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన కర్రి చంటిబాబు గాజువాక మార్కెట్‌లో డీజే ఈవెంట్స్ లైటింగ్ అండ్ డెకరేషన్స్‌లో పనిచేయడానికి కుదిరాడు. అయితే అతని రూ.5 వేల విలువగల ఫోను శనివారం రాత్రి పడుకున్న సమయంలో చోరీకి గురైంది. మండపంలోనే పడుకున్న చంటిబాబు సోదరుడు శివ కూడా సెల్ ఫోను పోయిందని తెలిపాడు. వెంటనే చంటిబాబు గాజువాక క్రైం పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఇటు వంటి దొంగతనాలపై గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ఫిర్యాదులు రావడంతో నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలమేరకు జాయింట్ కమిషనర్ సూచనల మేరకు క్రైం డీసీపీ కె.లతామాధురి పర్యవేక్షణలో జోన్- 2 క్రైం ఏసీపీ ఇన్‌చార్జి వెంకటరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్‌ఐ మన్మథరావుతో కూడిన స్పెషల్ క్రైం టీమ్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ముద్దాయిల పూర్తి సమాచారం సేకరించి ఆదివారం గాజువాక శ్రీకన్య థియేటర్ వద్ద కంచరపాలెం ప్రాంతానికి చెందిన నీలాపు అనోకు, కర్రి హేమవర్ధన్, వెతుందురి యోగిలను అరెస్ట్ చేశారు. వారి నుంచి నాలుగు మొబైల్స్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. చెడు వ్యసనాలకు బానిసై ఈజీ మనీ కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై గాజువాక, మల్కాపురం, పరవాడ పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి.

సమాజాభివృద్ధిలో ఇంజినీర్లు కీలకం

రాష్ట్ర కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్



ప్రతిభ చూపించిన సీజీఎంలకు అవార్డులు అందజేస్తున్న అధికారులు



విగ్రహావిష్కరణలో పాల్గొన్న నారాయణరావు, చంద్రశేఖర్

మురళీనగర్: సమాజాభివృద్ధిలో ఇంజినీరు కీలక పాత్ర వహిస్తాడని రాష్ట్ర కాలేజీ విద్య కమిషనరు, బీసీ వెల్ఫేర్, ఈడబ్ల్యూఎస్, జీఏడీ సర్వీసెస్ కార్యదర్శి డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యతన ఆదివారం నిర్వహించిన ఇంజినీర్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అభివృద్ధి, పరపాలన, ప్రణాళికా రచనలో ఇంజినీర్లు ప్రధాన భూమిక పోషిస్తారన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య అంతర్జాతీయంగా పేరు పొందిన ఇంజినీరని ఆయన వారసులుగా ఇంజినీర్లు అభివృద్ధి కార్యక్రమాల్లో తమ వంతు పాత్రను సమర్థంగా నిర్వహించాలని ఆయన సూచించారు. సివిల్ ఇంజినీరింగ్ గ్యాడ్యువేట్స్ సివిల్ సర్వెంటుగా ఉంటే ఎంత ఉపయోగమో తను అనుభవపూర్వకంగా తెలుసుకున్నానన్నారు. తాను ప్రకాశం జిల్లా కలెక్టరుగా ఉన్నప్పుడు వెలుగొండ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేశానన్నారు. ఆ జిల్లాలో నీటి నరుల రక్షణ, పునరుద్ధరణకు సమగ్రమైన ప్రణాళిక తయారు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మైనర్, మేజర్ ఇరిగేషన్‌ను ఇంటిగ్రేట్ చేసి అమలు చేస్తే మంచి ఉపయోగం ఉంటుందని తన నివేదికలో సూచించినట్లు చెప్పారు. కాబోయే ఇంజినీర్లు మంచి భవిష్యత్‌ను పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముందుగా కాలేజీలో ఏర్పాటు చేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. విగ్రహాన్ని కాలేజీ పూర్వ విద్యార్థులు ఎ.వరహాలు, ఎంఎస్‌డీ కుమార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు, పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేముడు, ఐఎస్‌టీఈ విశాఖ జిల్లా చాప్టర్ గౌరవ కార్యదర్శి డాక్టర్ కొండల ముఖేష్, పూర్వ విద్యార్థులు వి.రామచంద్రరావు. వి.నాగభూషణరావు, బాలకృష్ణ, సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఘనంగా మోక్షగుండం జయంతి

సీతమ్మధార : భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇంజినీర్స్ డే సందర్భంగా ఆదివారం సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్, డి.సుమన్ కల్యాణి, టి.వి.ఎస్.ఎన్. మూర్తి, బి.ఆశోక్‌కుమార్, పలువురు అధికారులు సిబ్బంది పూల మాలలు వేసి నివాళ్లలర్పించారు. ఇంజినీర్స్ డే సందర్భంగా విశిష్ట సేవలందించిన ఇద్దరు సీజీఎంలు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్‌లకు ఎమినెంట్ ఇంజినీర్ అవార్డులను అందజేశారు. ఈకార్య క్రమంలో పలువురు అధికారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో విశ్వేశ్వరయ్య విగ్రహావిష్కరణ

మురళీనగర్: భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆదివారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఇంజినీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రాంగణంలో డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, పెందుర్తి పాలిటెక్నిక్ ఓఎస్‌డీ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య భారతదేశానికి చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. నేటి తరం ఇంజినీర్లు సాంకేతిక అభివృద్ధి లేని కాలంలో అప్పటి ఇంజినీర్లు చేసిన అద్భుతాలను తెలుసుకోవాలని చెప్పారు. ఇంజినీరు ప్రతి విషయాన్ని సృజనాత్మకంగా ఆలోచించి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కాలేజీ వివిధ డిపార్టుమెంటు హెడ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదరగొట్టిన వైజాగ్ స్కూల్ చాంపియన్స్

సీతంపేట: విశాఖలో ఉన్న అన్ని పాఠశాలల్లో విద్యార్థు ప్రతిభను బయటకు తీసేలా వైజాగ్ స్కూల్ చాంపియన్స్ మెగా ఫైనల్ ఈవెంట్ ఆదివారం అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో విశ్వనాథ కన్వెన్షన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, గంట్ల శ్రీనుబాబు, కాశీ విశ్వనాథ్, సినీ హీరో కంచర్ల ఉపేంద్ర, ఆశ్రా చీఫ్ హబీబ్ ఆలీ హాజరై ఈవెంట్‌ను ప్రారంభించారు. నృత్యాలు, ఫ్యాషన్ డ్రెస్, పాటలు, స్పెషల్ టాలెంట్ ఇలా అన్ని రంగాలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రీ స్కూల్ విభాగంలో బచ్‌పన్, స్కూల్ విభాగంలో రెసో వైజాగ్, డ్యాన్స్ విభాగంలో ప్రెసిడెన్షియల్ స్కూల్ విజేతలుగా నిలిచాయి. వ్యక్తిత్వ వికాస నిపుణులు ఉదయ్‌కుమార్, అలజంగి, ప్రభాశర్మ, విజయలక్ష్మి, స్వాతి. యశ్వంత్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఇటీవల బ్యాంకాక్‌లో జరిగిన విశ్వ పోటీల విజేతలు కార్తికేయ రెడ్డి, ప్రీతి, యశ్వంత్ ప్రేమ పాల్గొన్నారు.

ఓనం ముగ్గుల పోటీలు



ఓనం రంగవల్లికను తీర్చిదిద్దుతున్న కేరళ మహిళలు

మురళీనగర్: కేరళీయుల ఓనం వేడుకల్లో భాగంగా బిర్లా కూడలి సమీపంలోని కళా కేరళీయంలో కేరళ కళా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కేరళ కళాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నిత్తన్, లైలా గణేష్‌లు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల రంగవల్లలతో ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఈనెల 22న నిర్వహించనున్న ఓనం ఉత్సవాల్లో విజేతలకు బహుమతులు అందిస్తామని అధ్యక్ష, కార్యదర్శులు చెప్పారు.

వరల్డ్ 'లా' డే శుభాకాంక్షలు
నేడు వరల్డ్ 'లా' డే సందర్భంగా మా న్యాయవాద సోదరులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మా హృదయపూర్వక వరల్డ్ 'లా' డే శుభాకాంక్షలు తెలియజేస్తూ...
PVR ASSOCIATES
(Regd. No. 1145)
P.V.P.A. HARA KUMAR
Advocate, Cell: 9949742465
Smt. P. ANNAPURNA
Advocate, Cell: 9642144232

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com